చెట్టు నీడే బస్‌షెల్టర్

- రేగొండలో నిలువ నీడ కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు


రేగొండ మండల కేంద్రంలో ప్రయాణికులకు నీడనిస్తున్న దుర్షన్ చెట్టు

టేకుమట్ల(రేగొండ): జిల్లాలోనే అతిపెద్ద మండలంగా 37 గ్రామ పంచాయతీలు ఉన్న రేగొండ మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు వ్యాపార, అధికార కార్యాలయాలకు, వ్యక్తిగత పనులపై నిత్యం మండల కేంద్రానికి వస్తూ, పోతుంటారు. అలాగే మండల కేంద్రం నుంచి పరకాల, హనుమకొండ, గోదావరిఖని, కాళేశ్వరం, మంచిర్యాల, ములుగు వంటి పట్టణాలతో పాటు టేకుమట్ల, చిట్యాల మండలాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రేగొండ మండల కేంద్రం నుంచే వెళ్తుంటారు. అలా ఎన్నో పట్టణాలకు అనుసంధానంగా ఉన్న మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్షన్ చెట్టే ప్రయాణికులకు బస్‌షెల్టర్‌గా నీడనిస్తుంది. పరకాల–భూపాలపల్లి ప్రధాన రోడ్డు ఉన్న రేగొండ మండల కేంద్రంలో ఇప్పటి వరకు ప్రయాణికులకు నీడను కల్పించే ఆలోచన పాలకులకు రాకపోవడం విడ్డూరమని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ నిర్మించకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు వాపోతున్నారు. భూపాలపల్లికి 20కిలో మీటర్లు, ములుగు జిల్లా కేంద్రానికి 25కిలో మీటర్లు, పరకాలకు 10కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడం దారుణమంటున్నారు.

తప్పని తిప్పలు

మండల కేంద్రంలో ఉన్న దుర్షన్ చెట్టే ప్రయాణికులకు బస్‌షెల్టర్‌గా నీడనిస్తుంది. ఎండాకాలంలో మాత్రం చల్లని నీడనిస్తున్నా, చలి, వర్షాకాలంలో మాత్రం ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. రేగొండ మండలంలోని ఎన్నో చిన్న చిన్న గ్రామాల్లో సైతం ప్రయాణికులకు బస్‌షెల్టర్లు ఉన్నా నిత్యం వేల మంది ప్రయాణించే మండల కేంద్రంలో బస్‌స్టాండ్ ఎందుకు నిర్మించలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి రేగొండ మండల కేంద్రంలో ప్రయాణికులకు సౌకర్యంగా బస్‌షెల్టర్ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టింపులేని పాలకుల వల్లే..



ప్రజా సమస్యలపై పట్టింపులేని పాలకుల వల్లే దశాబ్దాలుగా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేదు. నిత్యం వేల మంది ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఎండలో, దుకాణాల ముందు కూర్చుంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణాన్ని చేపట్టాలి.

– నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, రేగొండ

అనుమతులు తీసుకున్నాం..



రేగొండ మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించేందుకు పోలీస్‌స్టేషన్ ఎదురుగా 20గుంటల భూమిని గుర్తించి, తహసీల్దార్, కలెక్టర్ అనుమతి కూడా తీసుకుని ఆర్టీసీ అధికారులకు అందించాం. నిర్మాణ నిధుల కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి కూడా కలిశాం. ఇటీవల మండల సభలో బస్‌షెల్టర్ నిర్మాణంపై ప్రస్తావించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నిధులు కేటాయిస్తానని అన్నారు.

– ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, సర్పంచ్, రేగొండ

క్లుప్తంగా

నియామకం


శరత్‌బాబు, ఉపాధ్యక్షుడు


జగన్మోహన్‌రావు, కార్యదర్శి

టేకుమట్ల: సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్(టీ)కి చెందిన మార్క శరత్‌బాబు, జిల్లా కార్యదర్శిగా రామకిష్టాపూర్(వి)కి చెందిన అడగాని జగన్మోహన్‌రావులను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చర్లపెల్లి వెంకటేశ్వర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. తమపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శి బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షులు వెంకన్నకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నిక



ఏటూరునాగారం: మండలంలోని షాపెల్లి గ్రామానికి చెందిన మాదరి రాంబాబును మాలమహానాడు మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పసువుల రామ్మూర్తి ఆదివారం తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన మాదరి నర్సింగరావు, జిల్లా నాయకులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షలలకు మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, వల్లెకుంట జిల్లాపరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరు కానున్నారు.

టేకుమట్ల/రేగొండ: నేటి(సోమవారం) నుంచి కొనసాగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు టేకుమట్ల, రేగొండ మండల విద్యాధికారులు కోడెపాక రఘుపతి, ప్రభాకర్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. టేకుమట్లలో పరీక్షలు నిర్వహించే సెంటర్‌లో 150మంది విద్యార్థులు, రేగొండ, రంగయ్యపల్లి సెంటర్‌లలో 382 మంది వి ద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉద యం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంట ల వరకు కొనసాగే పరీక్షలకు గంట ముందుగా నే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

దిశను దశగా మార్చేది పదో తరగతి

టేకుమట్ల: ప్రతీ విద్యార్థికి పదో తరగతి దిశను దశగా మార్చేస్తుందని వెలిశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మియాపురం జగన్నాథం అన్నారు. సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా ఆదివారం 'సాక్షి'తో మాట్లాడుతూ పదవ తరగతిలోని పరిజ్ఞానాన్ని బట్టి ఇంటర్ విద్యకు పునాది పడుతుందని అన్నారు. విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

పరామర్శ



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని నిజాంపల్లికి చెందిన వంగాల చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకులు సాంబారి సాయికుమార్ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లస్వామి, రఘుపతి, రాజు, చిరంజీవి ఉన్నారు.

మాజీ ఎంపీ పర్యటన

వెంకటాపురం(కె): మండలంలో ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరావు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో ఆత్మీయులను, గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన నాయకులను కలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

అక్రమ అరెస్టులు సరికాదు


చిట్యాల: అరెస్టు అయిన నాయకులు


కాటారంలో..


పస్రాలో..

చిట్యాల: ములుగు జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పర్యటన నేపథ్యంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులను ఆదివారం పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు నేరెళ్ల ఓదెల మాదిగ మాట్లాడుతూ.. తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. బీజేపీ ఎన్నికల్లో గెలిచి ఏండ్లు గడుస్తున్న ఎస్సీ వర్గీకరణ చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో వర్గీకరణ చట్టబద్ధత చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీజేపీ తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పార్లపల్లి కుమార్, ఎలుకటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ములుగు జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన సందర్భంగా మండలంలోని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులను ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పలు గ్రామాల్లోని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులను ఇళ్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. వర్గీకరణ కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అడ్డుకోవడానికి వెళ్తున్న తమను పోలీసులు అరెస్ట్ చేయడం అమానుషం అన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి, నాయకులు చిట్యాల సమ్మయ్య, బొడ్డు ఆశయ్య, బొడ్డు రాజబాబు, ఆత్కూరి శంకర్, తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగు పైడి మాదిగ అన్నారు. ఆదివారం జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వస్తున్న క్రమంలో ఎమ్మార్పీస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్‌పీ నాయకులను శనివారం అర్థరాత్రి ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు. ప్రశ్నించే వారిని ముందస్తు అరెస్టు చేయడం సరికాదని అన్నారు. అరెస్టయిన వారిలో పేరాల బలరాం , తోకల రాంబాబు తదితరులు ఉన్నారు.

'ఎస్సీ, ఎస్టీ కేసులను నిర్వీర్యం చేసే కుట్ర'

టేకుమట్ల: ఎస్సీ, ఎస్టీ కేసులను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామానికి చెందిన యువతిని కులం పేరుతో దుర్భాషలాడిన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన బొల్లు రమణారెడ్డి, భాగ్యలక్ష్మీ, నాగరాజు, మాదవ రెడ్డి, వసంతలపై పోలీస్ స్టేషన్‌లో గత నెల 15 ఎఫ్ఆర్ నమోదైనా ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. బొల్లు రమణారెడ్డి మేనల్లుడు బొద్దిరెడ్డి వంశీరెడ్డి దళిత సామాజిక వర్గానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా లొంగదీసుకుని, నేడు కులం పేరుతో పెళ్లికి నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీలు స్పందించి దళిత యువతికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. లేని పక్షంలో దళిత సంగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

చంద్రబోస్‌ను సన్మానించిన ఎంపీటీసీ


చంద్రబోస్ సన్మాన సభలో ఆది రఘు

టేకుమట్ల: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు చిట్యాల మండలంలోని చల్లగరిగలో ఆదివారం ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్‌ను టేకుమట్ల ఎంపీటీసీ ఆది రఘు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టీ)లో దళిత సామాజిక వర్గాలకు చెందిన వారి భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న మాజీ ఎంపీపీ బందెల స్నేహలతనరేష్‌లపై అధికారులు చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇళ్ల స్థలాల కోసం సర్వే నంబర్ 370/సీ లో 3ఎకరాల 24గుంటల భూమికి కేటాయించిందన్నారు. కానీ 2019లో అప్పటి ఎంపీపీ బందెల స్నేహలతనరేష్ దళితుల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని మండిపడ్డారు. అక్రమ పట్టా విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా అక్రమ పట్టాను రద్దు చేసి దళితులకు ఇప్పించాలని కోరారు.

చెరువును పార్క్, గార్డెన్‌గా మార్చాలి

ఏటూరునాగారం: మండలంలో పిల్లలు, పెద్ద వాళ్లకు ఆహ్లాదకరమైన వాతావరణం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండల కేంద్రంలోని రసూల్‌కుంట(రాళ్లకుంట) చెరువును చిల్డ్రన్‌పార్క్, గార్డెన్‌గా ఏర్పాటు చేయాలని నాయకపోడు రాష్ట్ర నాయకులు గండెపల్లి నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు పూర్తిగా కబ్జాకు గురవుతుందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అధికారుల అండదండలు చూసుకొని కొంత మంది కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి రసూల్‌కుంట చెరువును వినియోగంలోకి వచ్చే విధంగా అభివృద్ధి చేయాలని కోరారు.

'మట్టల ఆదివారం' వేడుకలు


ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోదాపురం జీటీ ఎస్ఎస్ఎస్ చర్చిలో, పాస్టర్ లూకా, మండల కేంద్రంలోని సెంటనరీ మెతడిస్టు చర్చిలో పాస్టర్ విజయ్ చందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఈత మట్టలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి


మొగుళ్లపల్లి: పాపన్న వర్ధంతిలో గ్రామస్తులు


ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: సర్వాయి పాపన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గౌడ కులస్తులు అన్నారు. మండలంలోని పోతుగల్లు గ్రామంలో సర్ధార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ కులస్తులు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ బహుజనులకు రాజ్యాధికారం కోసం ఎన్నో ఉద్యమాలను చేశారని పేర్కొన్నారు. ఆదర్శప్రాయుడైన సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలను రాష్ట్రమంతటా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని కోరారు. పాపన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించి నేటి తరానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరెడ్ల రమాదేవి, అరెల్లి, తిరుపతమ్మ, బోల్లెపెల్లి వీరన్న, తిరుపతి, నరేందర్, రవి, సాంబయ్య, సురేష్, వెంకన్న, చందర్, రాజు,రాజుకుమార్, తిరుపతి, వీరమల్లు పాల్గొన్నారు.

ములుగు రూరల్: సర్వాయి పాపన్న వర్ధంతిని మండలంలోని సర్వాపూర్, గోవిందరావుపేట మండలం పస్రా గ్రామాలలో గౌడ సంఘం నాయకులు ఆదివారం నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, రణదీప్, షణ్ముక్, ఉదయ్‌కుమార్, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

పలిమెల: మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని నీలంపల్లి గ్రామంలోని గెర్రాయిగూడెంలో ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ నాయకులు

కాళేశ్వరం: ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శనిగరం గణపతి బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా నాన్చుడు ధోరణితో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను పట్టించుకోవడం లేదన్నాడు. ఈనెల 3న జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాజయ్య, రాణప్రతాప్, అవినాష్, శేఖర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ఎదుర్కోలేకనే బీజేపీ కుట్ర


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కాటారం: దేశ వ్యాప్తంగా రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేకనే ప్రధాని మోదీ, బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అది బీజేపీ, మోదీకి మింగుడుపడటం లేదని అన్నారు. లోక్‌సభ స్పీకర్ రాజ్యాంగ స్ఫూర్తిని పరిగణలోకి తీసుకోకుండా రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. దేశప్రజాస్వామ్యాన్ని కాపాడాలని గొంతెత్తి మాట్లాడుతున్న అసలు సిసలైన ప్రజాస్వామ్యవాది రాహుల్ గాంధీ అని, ఆయన పక్షాన నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు బీజేపీ అవినీతి, అహంకారాన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చేపుతారని అన్నారు. ఈ సమావేశంలో మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బొడ్డు మల్లయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మహేశ్ రవీందర్‌రావు, సర్పంచ్ రఘురాం, చీమల వెంకటస్వామి, కుమ్మరి అశోక్, కొట్టె శ్రీహరి, ఓంసింగ్, మంత్రి రాజు, మంత్రి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై లక్ష్మారెడ్డి


గర్భిణిని వాహనంలో తరలిస్తున్న ఎస్సై లక్ష్మారెడ్డి

ములుగు: పురిటినొప్పులతో ఓ గర్భిణి బాధపడుతుండగా గమనించిన ములుగు రెండవ ఎస్సై లక్ష్మారెడ్డి తన పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో బీజేపీ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో గర్భిణి తెల్లవారు జామున ఎస్సైకి కనిపించింది. గమనించిన ఎస్సై 108 వాహనం ఆలస్యం అవుతుందని వెంటనే అతడి వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! **సద్ది మహేందర్, తండ్రి: రాఘవరెడ్డి** గారు **కీర్తి సారయ్య, తండ్రి: రాజమల్లు** గ్రా॥ కొండేటిపేట, మం॥ ములుగు, జి॥ ములుగు గారు గ్రా॥ చెల్పూరు, మం॥ గణపురం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని ఇంటితో కూడిన ఖాళీ స్థలం ఇ.నెం. 1-78, ప్లాట్ నెం. 144, 160 గజాలు, సర్వే నెం.875/అ, 876, మరియు ఈ క్రింద తెలుపబడిన హద్దులు గల దానిని రిజిస్టరు విక్రయ దస్తావేజు నెం. 1483/2019, దిది: 13-03-2019 ద్వారా కొనుగోలు చేసినారు. కాని ఇట్టి ఆస్తికి సంబంధించిన పూర్వపు ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం. 1770/2012, దిది: 14-08-2012 వ్రాయించి ఇచ్చిన వారు **1. చిల్లా వెంకటేష్, తండ్రి: రాందాస్, 2) గంధం గోపాల్, తండ్రి: నర్సయ్య, 3. గంధం జంపయ్య, తండ్రి: నర్సయ్య,** వ్రాయించుకున్న వారు **తూర్పాటి రామానుజమ్మ, భర్త: భక్షం** గలది ఎక్కడో పోయినదని మరియు దొరకడం లేదని **సద్ది మహేందర్ గారు** తెలియజేయుచున్నారు. కావున ఒకవేళ అట్టి ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరములున్నచో లేక అట్టి ఒరిజినల్ దస్తావేజు ఎవరి స్వాధీనములో ఉన్నచో వారు ఈ ప్రకటన తారీఖు నుండి పదిహేను **(15) రోజుల లోపు** నా ఆఫీసుకి వచ్చి లిఖిత పూర్వకముగా అభ్యంతరములు తెలుపవలెను. సకాలములో అభ్యంతరములు రానిచో అసలు దస్తావేజు ఎక్కడో పోయినదని మరియు అట్టి ఆస్తిపై ఎలాంటి తగాదలు లేవని నమ్మి LIC Housing Finance Limited, Warangal వారు **సద్ది మహేందర్ గారికి** వారి యొక్క పద్ధతి ప్రకారము అప్పు Mortgage Loan మంజూరు చేయుటకు నిర్ణయము తీసుకోగలరు.

స్థలం యొక్క హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 149, **పడమర:** 33 ఫీట్ల రోడ్, **ఉత్తరం:** ప్లాట్ నెం. 143, **దక్షిణం:** ప్లాట్ నెం. 145.

(wit Consent of LIC Housing Finance Limited, Warangal వారి అనుమతితో)

సం/- **దుస్సా జనార్ధన్,** అడ్వకేట్
ఇ.నెం. 1-7-1246, ఫ్లాట్ నెం. బి-33, బాలసముద్రం, హన్మకొండ, వరంగల్. సెల్: 9849494941
తేది: 02-04-2023

ముమ్మరంగా వాహనాల తనిఖీ


ఏటూరునాగారం: వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై రమేష్


వాజేడు: వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై హరీష్

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ క్రాస్, ఐటీడీఏ, చెక్‌పోస్టు, వై జంక్షన్ వద్ద ఆదివారం ఎస్సై రమేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించారు. మావోయిస్టు యాక్షన్ టీంల సంచారం ఉందని సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమై ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వాహన డ్రైవర్ల వద్ద పత్రాలను పరిశీలించి పంపించారు. అనుమానిత వివరాలను సేకరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

వాజేడులో..

వాజేడు: మండలంలోని 163 నంబర్ జాతీయ రహదరి బీరమయ్య గుట్టపై ఆదివారం పోలీసులు ముమ్మర తనిఖీలను నిర్వహించారు. పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను సోదాలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.